క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం

కమలాపూర్: కమలాపూర్ మండల సర్వసభ్య సమావేశం నేడు (మంగళవారం) జరుగుతుందని ఎంపీడీఓ జి.పల్లవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం ఉదయం 10–30 గంటలకు ప్రారంభమయ్యే మండల సర్వసభ్య సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: నేడు(మంగళవారం) ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మండల కేంద్రంతో పాటు మండలంలోని తిరుమలగిరి, హౌజుబుజుర్గు, కటాక్షపూర్, మల్కపేట, కొత్తగట్టు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నిక

దామెర: మండలంలోని కోగిల్వాయి మత్స్యసహకార సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా రఘు, ఉపాధ్యక్షుడిగా వేణు, డైరెక్టర్లుగా శ్రీనివాస్, సందీప్, గణేష్, రాజేందర్, అనిల్, ఐలోని ఎన్నికైనట్లు వారు తెలిపారు.

లారీడ్రైవర్ల కార్యవర్గం ఎన్నిక

కమలాపూర్: హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ హజార్డ్ లారీడ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కోటి, కోశాధికారిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దేవేందర్, సహాయ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బండి శ్రీనివాస్ గెలుపొందారు.

నడికూడలో..

నడికూడ: మండలంలోని రాయపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్టేట్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అనంతరం స్టేట్ టీచర్స్ యూనియన్ నడికూడ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దాసరి శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఉడత మహేందర్, ఆర్థిక కార్యదర్శి మిడిదొడ్డి శ్రీధర్, మహిళా ఉపాధ్యక్షులు మాతంగి స్వరూప, కార్యదర్శి కందుకూరి రేణుక, అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేసు నమోదు

ఆత్మకూరు: నంబర్‌ప్లేటు లేకుండా వాహనాలు నడిపిన వారిపై సోమవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ గణేష్ తెలిపారు. వర్ధన్నపేట మండలం చెన్నారంకు చెందిన పెండ్యాల అక్యాపై కేసు నమోదు చేసి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మండలంలోని నీరుకుళ్లకు చెందిన వెన్నెపు రాజుపై కేసు నమోదు చేసి కారును సీజ్‌చేసినట్లు సీఐ గణేష్ తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవన్నారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

దామెర: వైద్యవిద్యార్థుల పరిశోధన కోసం కాలేజీకి పార్థివదేహం అప్పగించారు. హైదరాబాద్‌లోని శేర్‌లింగంపల్లికి చెందిన కొండ సుదర్శన మూర్తి(71) బ్యాంకులో ఉద్యోగంచేసి రిటైర్ అయ్యారు. తాను మృతిచెందిన అనంతరం తన శరీరాన్ని దానం చేస్తానని అమ్మ అవయవదాన హక్కుల ప్రోత్సాహ సంఘానికి గతంలో అనుమతిపత్రం సమర్పించారు. ఇదిలా ఉండగా సుదర్శనమూర్తి సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు అమ్మ అవయవదాన సంఘం సభ్యులకు సమాచారం అందించారు. వారు దామెర క్రాస్‌లోని ప్రతిమ రిలీఫ్ మెడికల్ సైన్స్ కళాశాలకు సోమవారం మృతదేహాన్ని అప్పగించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

భీమదేవరపల్లి: భీమదేవరపల్లి శివారులో సోమవారం తెల్లవారుజామున దొరికిన రూ.50వేల విలువైన సెల్‌ఫోన్‌ను ఆటోడ్రైవర్ పోలీస్‌లకు అప్పగించాడు. వివరాలు ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌కు చెందిన మైస మధూకర్ అనే ఆటోడ్రైవర్ సోమవారం తెల్లవారుజామున ఎల్కతుర్తి నుంచి భీమదేవరపల్లికి తన ఆటోలో వస్తున్న క్రమంలో భీమదేవరపల్లి శివారులో దొరికిన సెల్‌ఫోన్‌ను ముల్కనూర్ ఠాణాలో అప్పగించాడు. ఆసెల్ ఫోన్ గురించి ఆరాతీయగా కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్‌కు చెందిన రుద్రారపు ప్రేమ్‌రాజ్‌దని గుర్తించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఇతను హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

యాప్‌లోన్ పేరిట మోసం

భీమదేవరపల్లి : మీకు రుణం ఇచ్చేందుకు అర్హత ఉంది. అందుకు మీరు కొంత నగదు తమ ఖాతాకు జమచేస్తే మీకు అప్పు ఇస్తామంటూ మోసం చేసిన వారిపై సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపాడు. ముల్కనూర్‌కు చెందిన రెడ్డిమల్ల కుమారస్వామి, తాళ్లపల్లి సుకుమార్‌లకు వేర్వేరుగా యాప్‌లోన్ పేరిట రుణాలు ఇస్తామంటూ వారి ఖాతా నుంచి రూ.10 వేలు కాజేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెట్లకింద విద్యాబోధన


ఆరుబయట విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు


గోడకు ఏర్పాటు చేసిన బ్లాక్ బోర్డు


వరండాలో కొనసాగుతున్న విద్యాబోధన

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- వర్షం పడితే బడిబంద్

ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక చెట్ల కిందే విద్యాబోధనతో విద్యార్థులు ఉపాధ్యాయులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి వరకు మొత్తం 120 మంది విద్యార్థులు ఉండగా, పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే ఐదు గదులు మాత్రమే ఉన్నాయి. దీనితో ప్రతిరోజు రెండు తరగతులను అనివార్యంగా చెట్లకింద చేపడుతున్నారు. ఈక్రమంలో రోడ్డు ప్రక్కన పాఠశాల ఉండడంతో రోడ్డుపై వాహనాల రాకపోకల శబ్దానికి విద్యార్థుల ఏకాగ్రతకు దెబ్బతింటున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతిరోజు విడతల వారీగా ఒక రోజు రెండు తరగతులు, మరోరోజు ఇంకో రెండు తరగతుల చొప్పున విద్యార్థులు చెట్లకింద కూర్చొని పాఠాలు వింటున్నారు. దీంతో చిన్నపాటి వర్షం పడినా ఆ తరగతులకు ఆరోజు సెలవు ప్రకటించాల్సిన దుస్థితి. లేదంటే వరండాలో విద్యాబోధన చేపడుతారు. చెట్లకింద మట్టిలో కూర్చోవాల్సి వస్తుందని విద్యార్థులు బడికి డుమ్మా కొడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టడానికి, విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు మన ఊరు–మన బడి కార్యక్రమం చేపట్టింది. దీనితో క్యాతంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ పట్టనుందనిఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశ పడ్డారు. కానీవారి ఆశలు ఆదిలోనే అడియాశలు అయ్యాయి. ఇప్పటికైనా పాఠశాలకు మౌలిక వసతుల కల్పనతో పాటు, అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అదనపు గదులు నిర్మించాలి



పాఠశాలలో కనీసం రెండు తరగతి గదులయినా నిర్మించాలి. అదనపు తరగతి గదుల నిర్మాణం విషయం పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు అదనపు గదులు మంజూరు చేసి విద్యార్థుల అవసరాలు తీర్చాలి.

– పిన్నపురెడ్డి అవనిజరెడ్డి సర్పంచ్

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి


హౌజుబుజుర్గులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని హౌజుబుజుర్గు, మల్కపేట గ్రామాలలో సోమవారం నూతన గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తోందన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఆధునిక హంగులతో భవన నిర్మాణాలు జరుపుతామని హామీ ఇచ్చారు. గత పాలకులు గ్రామపంచాయతీ పాలనను విస్మరించారని విమర్శించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, సర్పంచ్‌లు రబీయాబీ హుస్సేన్, వేణు, టీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, దుంపల బుచ్చిరెడ్డి, ఎన్కతాళ్ల రవీందర్, రాజస్వామి, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..

వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం మండలంలోని కటాక్షపూర్, హౌజుబుజుర్గు, నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీరుకుళ్ల మాజీ సర్పంచ్ బండి సాంబయ్య బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధపార్టీల నాయకులంతా బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారన్నారు.

‘ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుంటాం’

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల: 2023 ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి రాగానే పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇప్పటి వరకు దోచుకున్న ప్రభుత్వ, పేదల భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పట్టణంలోని పలు వార్డులలో బీజేపీ నాయకులు పర్యటించి ప్రజాసమస్యలను పరిశీలించారు. ప్రారంభోత్సవానికి నోచుకొని పరకాల మున్సిపాలిటీ, కొనసాగుతున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణపు పనులు, ఆక్రమణకు గురయిన పరకాల సహకార సంఘం భూమిని సందర్శించారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి మాట్లాడారు. కాంట్రాక్ట్ పనులకే పరిమితమైన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజాసేవకుడుగా పనికిరాడన్నారు. ఇప్పటికే రెండ్లుసార్లు గెలిపించి మోసపోయినట్లు ప్రజలు ఆలోచనలో పడ్డారన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయినప్పటీ నుంచి ప్రజాసమస్యల కంటే ప్రభుత్వ భూములు, పేదల భూములను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బీసీ కాలనీ సమీపంలో సీఎంఎస్ గోదాం నిర్మించడంతో ఖాళీ చేసిన పాత గోదాంను చారిటబుల్ ట్రస్టుకు విరాళం అందించిన వారికి ఎమ్మెల్యే ధారదత్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, కొత్తగూడెం జిల్లా ప్రభారి దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మేకల రాజవీర్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కె.విజయ్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు సంఘ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విధులకు న్యాయవాదుల గైర్హాజరు


కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పరకాల: రాష్ట్రంలో న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, అక్రమ కేసులను నిరసిస్తూ సోమవారం పరకాల కోర్టు విధులకు న్యాయవాదు గైర్హాజరయ్యారు. అనంతరం పరకాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ముందు నిరసన తెలిపి అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ మాట్లాడుతూ నిజామాబాద్ కలెక్టర్ న్యాయవాదులపై బనాయించిన అక్రమ కేసులను ప్రభుత్వం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ చర్యపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, ఓంటేరు రాజమౌళి, జి.జగదీశ్వర్, బండెల స్వామి, వి.చంద్రమౌళి, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

వీరభద్రుడి కల్యాణానికి ఎమ్మెల్యే..

భీమదేవరపల్లి: కొత్తకొండలో మంగళవారం జరగనున్న వీరభద్రస్వామి–భద్రకాళి కల్యాణానికి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మార్పాటి మహేందర్‌రెడ్డి తెలిపారు. దీనికి అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేయాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ధర్మసాగర్: మండలంలోని ముప్పారం గ్రామ శివారులో సర్వే నంబర్ 258లో ఎటువంటి మైనింగ్ కార్యకలాపాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్థలంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేస్తోందని తెలిపారు. అలాగే పందెన మల్లన్న క్షేత్రం సమీపంలో అక్రమ మైనింగ్ తరలింపును నిలిపివేయాలని, దాని వలన గ్రామంలోని ప్రకృతి సంపద ధ్వంసం అవడమే కాకుండా పెంపుడు పశువులకు ఆహారం సైతం దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని రోడ్లు అన్ని పాడవడమే కాకుండా దారిలో స్కూల్‌లోని పిల్లలు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ వలన ఏర్పడే దుమ్ము వలన పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా గ్రామంలో మైనింగ్ కార్యకలాపాలు ఆపకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడ్డం రాజయ్య, ముంజ వెంకట్రాజం, దారవు రాములు, శివసాని ప్రవీణ్, గడ్డం మల్లేష్, కందుకూరి జనార్ధన్, గడ్డం అనిల్, బుర్ర రమేష్, గోనెల రాజు, కందుకూరి రవిబాబు, పరిటాల ఇస్తారి, ఎథిరాజు మల్లయ్య, గొళ్లన లింగయ్య, ఎర్ర చేరాలు తదితరులు పాల్గొన్నారు.

‘వరి’లో నివారణ చర్యలు తీసుకోవాలి


కాండం తొలుచు పురుగు ఆశించిన వరిని పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మారెడ్డి

కమలాపూర్: వరిలో కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జాలి లక్ష్మారెడ్డి రైతులకు సూచించారు. సోమవారం ఆయన కమలాపూర్ మండలంలోని నాట్లు వేసిన పొలాలను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా సుమారు 70 శాతం నాట్లు పూర్తయ్యాయని, అయితే ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉందని తెలిపారు. కాండం తొలుచు పురుగు వరి నారును ఆశిస్తే మొక్క మొత్తం చనిపోతుందని, నాటిన వరిలోనైతే పిలకలు చనిపోతాయని తెలిపారు. నారుమడిలో కాండం తొలుచు పురుగు నివారణకు నారు పీకే ఏడు రోజుల ముందు ఎకరా నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ గోళీలు చల్లుకోవాలని, నారు చివరలు తుంచి గుడ్డు దశను నివారించవచ్చని సూచించారు. నాటిన పొలంలో కాండం తొలుచు పురుగు నివారణకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ గోళీలు లేదా 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గోళీలు లేదా 4 కిలోల క్లోరాంత్రనిప్రోల్ గుళికలు ఎకరాకు చల్లుకోవాలని సూచించారు. నాటిన 20–25 రోజులకు కాండం తొలుచు పురుగు ఆశించినచో ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 60 నుంచి 80 మిల్లీ లీటర్ల క్లోరాంత్రనిప్రోల్ పిచికారీ చేయాలన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

నడికూడ: గత ఏడాది అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రెండు, మూడు రోజులలో నష్టపరిహారం రైతుల ఖాతాలో జమకానున్నట్లు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి అన్నారు. సోమవారం పరకాలలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటనష్టాన్ని పరిశీలించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకపోగా జీఓ నంబర్ 42ని జారీ చేసినట్లు తెలిపారు. పంటనష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించనున్న నేపథ్యంలో మండల నాయకులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతుబంధు కో–ఆర్డినేటర్ బొల్లె భిక్షపతి, పరకాల మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, మాదారం సొసైటీ చైర్మన్ నల్లెల లింగమూర్తి, ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ సుమలత, వైస్ ఎంపీపీ కుమారస్వామి, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానించిన ఉపాధ్యాయులు


కమలాపూర్: రాంచరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


అవార్డులు పొందిన ఉపాధ్యాయినిలు

కమలాపూర్: జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి బి.రాంచరణ్‌ను సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 7న జిల్లాస్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో రాంచరణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక కాగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసిన రాంచరణ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీలత, ప్రభాకర్, వీరకుమార్, స్వరూపరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలకు సావిత్రిబాయి పూలే అవార్డులు

ఐనవోలు: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయనిల అవార్డులు ప్రకటించారు. మండలానికి చెందిన కె పద్మలత(ఎంపీపీఎస్,కక్కిరాలపల్లి), కోటగిరి సునీత (కేజీబీవీ, ఐనవోలు), బి శ్వేత(ఎంజేపీ, ఐనవోలు) అవార్డులు అందుకున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చుంచుకాల లింగారావు తెలిపారు. కాగా సోమవారం మండల టీఎస్‌యూటీఎఫ్ నాయకులు రవీందర్, బ్రహ్మచారి, సీఎస్ఆర్ మల్లిక్‌లు ఉపాధ్యాయినిలను అభినందించారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలి

ఎల్కతుర్తి: ఈనెల 26 నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టబోయె హాత్‌సే హాత్ పాదయాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక అప్పుల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసైన్డ్ భూములను టీఆర్‌ఎస్ నాయకులు కబ్జాలు చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. దళితబంధు పేరిట దళితులను మోసం చేస్తూ తమ అనుచరులకే దళితబంధును ప్రకటిస్తూ మిగతా వారిని పక్కన పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. ధరణి పోర్టల్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినే సంతాజీ, ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాముడు, మహేందర్, గొర్రె మహేందర్, సుమన్‌గౌడ్, పాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఎంపీపీ మార్నేని మధుమతి

ఐనవోలు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మార్నేని మధుమతి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్ష సమావేశం ఎంపీపీ మార్నేని మధుమతి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, స్పెషల్ ఆఫీసర్, డీసీఓ నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ఐనవోలు, కొండపర్తి పీహెచ్‌సీల పరిధిలో 18 గ్రామ పంచాయతీలు, 11 హామ్లెట్ గ్రామాల్లో 18 సంవత్సరాలు పైబడిన సుమారు 38 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 18 నుంచి మే చివరి వరకు కంటి పరీక్షలు గ్రామాల వారిగా ఆయా తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు అందిస్తామని, శస్త్రచికిత్సలు అవసరమయ్యే వారికి రెఫరల్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు.

ఆయా గ్రామాల్లో కంటి వెలుగు నిర్వహించే తేదీలివే..

ఐనవోలు పీహెచ్‌సీ పరిధిలోని ఐనవోలులో జనవరి 18 నుంచి ఫిబ్రవరి 15 వరకు, ఒంటిమామిడిపల్లిలో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు, ఉడుతగూడెంలో మార్చి 1 నుంచి 3 వరకు, పున్నేలు మార్చి 6 నుంచి 28 వరకు, పంథినిలో మార్చి 29 నుంచి ఏప్రిల్ 25 వరకు, పెరుమాండ్ల గూడెంలో ఏప్రిల్ 26 నుంచి మే 2వరకు, కక్కిరాలపల్లిలో మే 3 నుంచి 17 వరకు, నందనంలో మే 18 నుండి జూన్5 వరకు, రాంనగర్‌లో జూన్ 6 నుంచి 9 వరకు, రెడ్డిపాలెంలో జూన్ 12 నుంచి 16 వరకు, కొండపర్తి పీహెచ్‌సీ పరిధిలోని కొండపర్తిలో జనవరి 18 నుంచి ఫిబ్రవరి 9 వరకు, వనమాల కనపర్తిలో ఫిబ్రవరి 10 నుంచి 21 వరకు, గర్మిళ్లపల్లి ఫిబ్రవరి 22 నుంచి మార్చి 6 వరకు, లింగమోరిగూడెంలో మార్చి 8 నుంచి 10 వరకు, ముల్కలగూడెంలో మార్చి 13 నుంచి 20 వరకు, నర్సింహులగూడెంలో మార్చి 21 నుంచి 27 వరకు, వెంకటాపూర్‌లో మార్చి 28 నుంచి ఏప్రిల్ 25 వరకు నిర్వహించబడును. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, మెడికల్ ఆఫీసర్లు శ్రీనివాస్, సుభాష్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది సునంద, సాంబయ్య, సరస్వతి, రాజేంద్ర ప్రసాద్, రవీందర్, కమలాగ్రేస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట: రాష్ట్రంలో ఈనెల 18న ప్రారంభించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి తెలిపారు. ఈసమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరవుతారన్నారు. ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

భీమదేవరపల్లిలో..

భీమదేవరపల్లి: భీమదేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

‘అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు’

ఐనవోలు: అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సర్పంచ్ బండి పర్వతాలు, నారాయణరెడ్డి, మహేందర్, ఉప్పలయ్యలతో కలిసి లింగయ్య మాట్లాడారు. ప్రభుత్వం పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో జరిగిన అవకతవకలను సరిచేయాలని, పాత పద్ధతిలోనే నియామక ప్రక్రియ కొనసాగించాలని డిమాండ్ చేశారు. సోమవారం చలో ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో డీవైఎఫ్ఐ నాయకుడు దద్దు రాజును పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యువతకు మద్దతుగా తాము పోరాటాలు చేస్తామన్నారు.

ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్‌ను కలిసిన గ్రామస్తులు



ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన వేముల నాగరాజు ఇటీవల జరిగిన వరంగల్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో విజయం సాధించి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. సోమవారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు హనుమకొండలో నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, ఉప సర్పంచ్ బొల్లం ప్రకాష్, రైతుబంధు సమితి కన్వీనర్ పడిదల సమ్మారావు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆకుతోట యాకయ్య, ఎండీ అబ్బాస్ అలీ, గూబ అరుణ్‌కుమార్, అలువాల నవీన్, అరూరి భిక్షపతి, చిర్ర రాములు, కాటబోయిన కుమారస్వామి పాల్గొన్నారు.